## క్లుప్తంగా

### గణపతి ఉత్సవాల్లో నిబంధనలు తప్పనిసరి



సంగెం : గణపతి ఉత్సవాల్లో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఉత్సవ కమిటీల బాధ్యులకు పర్వతగిరి సీఐ రాజగోపాల్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉత్సవ కమిటీల బాధ్యులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం చేపట్టాలన్నారు. విగ్రహాల వద్ద, నిమజ్జన ఊరేగింపు సమయంలో డీజే పెట్టొద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే డీజేలను స్వాధీనం చేసుకోవడంతోపాటు బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. డీజేకు ప్రత్యామ్నాయంగా బ్యాండ్ మేళాలు, డప్పుచప్పుళ్లు, కోలాటాలతో ఊరేగింపు నిర్వహించాలని నిర్వహణ కమిటీలకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్, ఎస్సై నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

### సన్మానం



నర్సంపేట : ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు శింగిరికొండ మాధవశంకర్, యూత్ అధ్యక్షుడు శ్రీరాం కిరణ్‌లను నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్ వాకర్స్ మిత్రులతో కలిసి శాలువాతో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు వివిధ క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆడెపు సదానందం, కోశాధికారి సంకినేని కృష్ణ, సభ్యులు చంద్రమౌళి, రవిగౌడ్, మనోహర్‌గౌడ్, అశోక్, మోహన్, గటిక రవీందర్, సాంబయ్య, డాక్టర్ జగదీశ్వర్, భిక్షపతి, కేశపాక అశోక్, నిమ్మ రాజు, తదితరులు పాల్గొన్నారు.

### పొలాల దారి కబ్జా..!

నల్లబెల్లి : మండలంలోని ఎర్రచెరువుతండా శివారులోని బీటీ రోడ్డు నుంచి పంట పొలాలకు వెళ్లే దారి కబ్జాకు గురైనట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎర్రచెరువుతండాకు చెందిన బానోత్ దస్రు జేసీబీతో భూమి చదును చేసి వరి పంట సాగు పనులు చేపట్టగా ఆయన పొలాల దారిని ఆక్రమించుకున్నాడంటూ పలువురు రైతులు బానోతు బీక్యా, అచ్చు, బాలు, భీమా, సంపత్, స్వామి శనివారం ఎస్సై గోవర్ధన్ దృష్టికి తీసుకెళ్లారు. పొలాలకు దశాబ్దాలుగా ఉన్న సదరు దారి మీదుగా రైతుల రాకపోకలను దస్రు అడ్డుకుంటున్నాడని, కొంత కాలంగా తన సొంత భూమిగా ప్రచారం చేసుకుంటున్నాడని తెలిపారు. దస్రు తీరుపై విచారణ చేపట్టి రహదారిని కబ్జా నుంచి కాపాడాలని కోరారు.

### సర్వాయి పాపన్న జయంతి



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని దాసరిపల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుక శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపయ్య చిత్రపటానికి సంఘం అధ్యక్షుడు వల్లాల శేఖరయ్య, గోపా అధ్యక్షుడు వల్లాల జనార్దన్, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాక రాజలింగం, వల్లాల కరుణాకర్, సుద్దాల శేఖరయ్య, సుద్దాల రవి, వలాల్ల కోటి తదితరులు పాల్గొన్నారు.

### హాస్టళ్లకు నాణ్యమైన కూరగాయలు అందించాలి

నర్సంపేట : ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లకు నాణ్యమైన కూరగాయలు అందించాలని డీబీఆర్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మడి బాబు డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం హాస్టళ్లకు అందుతున్న కూరగాయలను శనివారం పరిశీలించింది. ఈ సందర్భంగా బాబు మాట్లాడారు. హాస్టళ్లకు కాంట్రాక్టర్లు కుళ్లిపోయిన, ముదిరిపోయిన కూరగాయాలు గతంలో పంపిణీ చేయగా పలుమార్లు హెచ్చరించినట్టు తెలిపారు. నాసిరకం కూరగాయలు సరఫరా చేస్తే విద్యార్థుల ఆరోగ్యం చెడిపోయే ప్రమాదం ఉందన్నారు. గతంలో ఫుడ్ పాయిజన్ అయ్యి విద్యార్థులు ఆస్పత్రుల పాలైన ఘటనలున్నాయని చెప్పారు.

### ఒకరిపై ఫిర్యాదు

ఆత్మకూరు : మీసేవ కేంద్రంపై అసత్యప్రచారం చేస్తున్నాడని స్థానిక మీసేవ నిర్వాహకుడు కరివేద మహేందర్‌రెడ్డి ఓ వ్యక్తిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కామారం గ్రామానికి చెందిన మూల మధుకర్ సోషల్ మీడియాలో మీసేవ, తనపై అసత్య ప్రచారం, దూషిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం

- ఎప్పటికప్పుడు అధికారుల పరిశీలన

నెక్కొండ : మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో జోరు సాగుతోంది. మొత్తం 39 గ్రామ పంచాయతీల పరిధిలో 730 ఇళ్లు మంజూరు కాగా 637 మంది లబ్ధిదారులకు అధికారులు రెండు నెలల క్రితమే ప్రొసీడింగ్స్ అందజేశారు. అందులో 502 మంది ఇళ్ల నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ఇందులో 342 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌కు రాగా సదరు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో రూ.లక్ష చొప్పున జమైనట్టు గణాంకాలు చెబుతున్నాయి. అలాగే 39 ఇళ్లు రూఫ్ లెవల్, 17 స్లాబ్ వేసి ఉండగా వారికి సైతం రూ.లక్ష చొప్పున మంజూరయ్యాయి.

**అధికారుల పర్యవేక్షణ**

ఇళ్ల నిర్మాణాలను అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ లబ్ధిదారులకు అవసరమైన సూచనలు అందిస్తున్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, సిమెంట్, ఇటుకలు, ఐరన్, తదితర మెటీరియల్ లభ్యతతోపాటు మేస్త్రీలు, కూలీలు, తదితరాలపై పర్యవేక్షిస్తూ సమస్యలు తలెత్తకుండా చూస్తున్నారు. కొన్ని ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతుండగా కొందరు వివిధ కారణాలతో ఇంకా పనులు చేపట్టలేదు. అలాంటి వారిని గుర్తించి అధికారులు అవగాహన కల్పించారు. సమస్యలను అధ్యయనం చేస్తూ సమాధానం చెప్పి పనులు చేపట్టేలా చొరవ చూపుతున్నారు. ఆర్థికంగా మరింత బలహీనంగా ఉన్న లబ్ధిదారులకు మహిళా సంఘాల నుంచి రూ.లక్ష వడ్డీ లేని రుణం తీసుకోవాలని చెప్పారు.

**పైలెట్ ప్రాజెక్టుగా బొల్లికొండ**

మండలంలోని బొల్లికొండ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం ఎంపిక చేసి 121 మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. లబ్ధిదారులందరూ ఇళ్ల నిర్మాణాలను సకాలంలో, ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించుకునేలా అధికారులు అవగాహన కల్పించారు. సుమారు 53 ఇళ్లు వివిధ దశలో ఉండగా బిల్లులు కూడా అందాయి. వర్షాకాలం నేపథ్యంలో ఇప్పటికీ కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో వారికి అధికారులు అవగాహన కల్పించారు.



బొల్లికొండలో నిర్మాణంలో ఉన్న ఇల్లు

**స్వప్నం సాకారమైంది**



సొంతిల్లు కట్టుకోవాలన్న స్వప్నం సాకారమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో మాకు ఆదరువు లభించింది. ఇంటి నిర్మాణం ప్రారంభించాం. స్లాబ్ వరకు పనులు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు మాకు రూ.3 లక్షల అందాయి.

- బానోతు విజయ, లబ్ధిదారు, బొల్లికొండ

**ఆనందానిచ్చింది**



ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం ఆనందానిచ్చింది. ఇంటి నిర్మాణంలో మేస్త్రీలు, కూలీలతోపాటు కుటుంబ సభ్యులం ఇష్టంగా కష్టపడుతున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు సకాలంలో పూర్తి చేస్తాం. బిల్లులు సకాలంలో అందుతున్నాయి.

- పంజాల అఖిల, లబ్ధిదారు, బొల్లికొండ

**అవగాహన కల్పిస్తున్నాం**



ఇళ్ల నిర్మాణం చేపట్టని లబ్ధిదారులను కలిసి అవగాహన కల్పిస్తున్నాం. సమస్యలను గుర్తించి సమాధానాన్ని సూచించి నిర్మాణం చేపట్టేలా చైతన్యవంతం చేస్తున్నాం. సకాలంలో వంద శాతం ఇళ్ల నిర్మాణం పూర్తి అయ్యేలా చొరవ తీసుకుంటున్నాం.

- ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ

## బాలికల్లో చైతన్యమే 'స్నేహ' లక్ష్యం

- ఎంపీడీఓ అరుంధతి



శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అరుంధతి

దుగ్గొండి : కిశోర బాలికల్లో చైతన్యం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో స్నేహ సంఘాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీఓ అరుంధతి తెలిపారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు శనివారం నిర్వహించిన శిక్షణా శిబిరంలో ఎంపీడీఓ మాట్లాడారు. గ్రామాల్లో 15 నుంచి 18 వరకు వయస్సున్న బాలికలతో సంఘాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. అనంతరం విద్య, ఆరోగ్యం, ఆహారం, భద్రత తదితర అంశాలపై సంఘాలను చైతన్యవంతం చేయాలని తెలిపారు. జీవితంలో, సమాజంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేలా బాల్యదశలోనే సంసిద్ధులను చేయాలని సూచించారు. సంఘాలకు వివిధ శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ సూచనలు, సలహాలు అందించాలని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, ఎస్సై రావుల రణధీర్‌రెడ్డి, ఏపీఎం రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

## పౌరహక్కుల రక్షణ సామాజిక బాధ్యత



నెక్కొండ : మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

నర్సంపేట/నెక్కొండ/సంగెం : పౌరహక్కుల రక్షణను సామాజిక బాధ్యతగా చెన్నారావుపేట డిప్యూటీ తహసీల్దార్ రజని, నెక్కొండ ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, సంగెం ఎంపీఓ కొమురయ్య అభివర్ణించారు. ఆయా మండలాల్లో శనివారం నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవాల్లో వారు మాట్లాడారు. పౌరహక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కులవివక్ష, తదితరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. సమాజంలోని ప్రతిఒక్కరికీ జీవించే హక్కు ఉందన్నారు. కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్లు రవి, శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత, ఆర్‌ఐలు నరేందర్, బాలాజీ, ఐబీ ఏఈ కిరణ్మయి, సీహెచ్ఓ భద్రయ్య, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మల్లమ్మ, ఏపీఓ అరుణ, పంచాయతీ కార్యదర్శి వికాస్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## టీఎల్‌ఎంతో అభ్యసన సామర్థ్యం పెంపు

- ఎంఈఓ గుగులోతు రాము



ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ రాము

సంగెం: టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం)తో విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెరుగుతుందని ఎంఈఓ గుగులోతు రాము తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ సెకండరీ స్కూల్‌లో శనివారం నిర్వహించిన మండల స్థాయి టీఎల్‌ఎంను ఆయన ప్రారంభించి ఎగ్జిబిట్లను తిలకించి మాట్లాడారు. తెలుగు, ఆంగ్లం, గణితం, సామాన్య శాస్త్రం ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా 95 ఎగ్జిబిట్లు ప్రదర్శించడం అభినందనీయమని చెప్పారు. ఉత్తమమైనవి 10 ఎగ్జిబిట్లు ఎంపికయ్యాయని తెలిపారు. విద్యార్థులకు విషయ పరిజ్ఞానం పెరగడమే కాకుండా చదువుతున్న విషయాలు మనస్సులో నిలిచిపోయేలా బోధించే దిశగా టీఎల్‌ఎం అమలుకు కృషి చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు చైతన్య, రాయపురెడ్డి, భావన, భాస్కరా చారి, సాంబమూర్తి, సీఆర్‌పీలు శ్రీధర్, శంకర్, రాజు, సరిత, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అధికార పార్టీకి లబ్ధి చేకూర్చేలా..

- బీజేపీ అధికార ప్రతినిధి మహేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

వర్ధన్నపేట : అధికారుల పని తీరు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి లబ్ధి చేకూర్చేలా ఉందని బీజేపీ అధికార ప్రతినిధి కుందూరు మహేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డుల విభజన అశాస్త్రీయంగా చేపట్టారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారుల మీద ఒత్తిడి తెచ్చి అడ్డదారిన గెలిచేందుకు యత్నిస్తోందని చెప్పారు. ఆర్నెళ్లుగా ఓటరు సవరణ పేరుతో సమావేశాలు నిర్వహించినా పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల ఓటర్ లిస్టు ఆధారంగా వార్డుల విభజన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఒకే వ్యక్తికి రెండు వార్డుల్లో ఓటున్నా సవరించలేదని, మృతులను జాబితా నుంచి తొలగించలేదని తెలిపారు. ఇకనైనా అధికారులు కళ్లు తెరిచి తప్పులను సరిదిద్దడంతోపాటు వార్డులను శాస్త్రీయ పద్ధతిలో విభజించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి జడ సతీశ్, నాయకులు మడత రాజేశ్, గోరుకంటి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- ఎంసీపీఐ(యూ) కార్యదర్శి మల్లికార్జున్



మాట్లాడుతున్న మల్లికార్జున్

దుగ్గొండి : పల్లెల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి సింగతి మల్లికార్జున్ తెలిపారు. మండలంలోని అడవి రంగాపురం గ్రామాన్ని ఆయన ఆధ్వర్యంలోని బృందం శనివారం సందర్శించి స్థానిక సమస్యలను అధ్యయనం చేసింది. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడారు. వీధులు వర్షపు నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయని చెప్పారు. వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయిందని తెలిపారు. బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదని వివరించారు. పంచాయతీ కార్యదర్శి గ్రామంలో ఉండకుండా బాధ్యతారాహితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే పారిశుద్ధ్య పనులు చేపట్టకుంటే ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు బుడిమె సురేందర్, కుమారస్వామి, గాంధీ, ఓంకార్, సతీశ్, కిరణ్, అంకతి రణధీర్, తదితరులు పాల్గొన్నారు.

### మండలంలో ముదురుతున్న డిప్యుటేషన్ వివాదం

గీసుకొండ : మండలంలో పంచాయతీ కార్యదర్శుల డిప్యుటేషన్ వివాదాస్పదంగా మారుతోంది. విధుల నుంచి రిలీవ్ కావాలన్న ఆదేశాలకు పంచాయతీ కార్యదర్శి కల్యాణి స్పందించకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవల పలువురు పంచాయతీ కార్యదర్శులను డిప్యూటేషన్‌పై పంపుతూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బొడ్డుచింతలపల్లి పంచాయతీ కార్యదర్శి దుగ్గొండి మండలంలోని నాచినపల్లికి, అక్కడ పని చేసిన కార్యదర్శి ఆనంద్ బొడ్డుచింతలపల్లికి వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో ఆనంద్ ఈనెల 28న విధుల్లో చేరగా కల్యాణి రిలీవ్ కావడం లేదు. దీంతో డీపీఓకు ఎంపీడీఓ నివేదించినట్టు తెలిసింది. గతంలో ఎంపీఓగా పని చేసిన ధనలక్ష్మి ఎలుకుర్తి హవేలి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కల్యాణి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయగా ఆమెను వారం రోజుల్లోనే డీపీఓ కార్యాలయానికి అటాచ్ చేసిన విషయం తెలిసిందే. అలాగే మాజీ ఎంపీపీ బీమగాని సౌజన్యకి ఎలుకుర్తి సర్పంచ్‌గా ఉన్న రోజుల్లో పంచాయతీ కార్యదర్శి కల్యాణితో పొసగక వివాదం ముదరడంతో నాటి అధికార పార్టీ నాయకులు రాజకీయ ఒత్తిడితో కండక్టర్‌గా పని చేస్తున్న సౌజన్య భర్తను భూపాల్‌పల్లి జిల్లాకు బదిలీ చేయించారన్న వ్యాఖ్యలు తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో గీసుకొండ పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన వ్యక్తి 'రానున్నది కొండా పటేల్ రాజ్యమే..' అంటూ ప్రైవేట్‌గా చేసిన వ్యాఖ్యలు నాటి అధికార పార్టీ నాయకులకు చేరడంతో ఆయన్ను దుగ్గొండి మండలానికి బదిలీ చేయించారు. ఇలా అధికారంలో ఉన్న వారిదే రాజ్యం అన్న పరిస్థితి మండలంలో నెలకొంది. కాగా డిప్యుటేషన్ రద్దు చేయించేందుకు రాజకీయ నాయకులు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.

### 'స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి'

రాయపర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని ఆ పార్టీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్ శ్రేణులకు సూచించారు. ఆయన ఆధ్వర్యంలో మండలంలోని మైలారంలో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు అమలు కాక అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వార్డుల వారీగా పార్టీ ఇన్‌చార్జ్‌లను నియమించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ కమిటీ ఇన్‌చార్జ్ కుందూరు యాదగిరిరెడ్డి, నాయకులు లేతాకుల రంగారెడ్డి, సంది వంశీధర్‌రెడ్డి, పరుపాటి రవీందర్‌రెడ్డి, బైరు యాకయ్య, గూడెల్లి వెంకటయ్య, గబ్బెట యాకయ్య, గుగులోతు చందునాయక్, ఈదులకంటి సంపత్‌రెడ్డి, గాడిపెల్లి రాములు, లేతాకుల యాకూబ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థికసాయం

ఐనవోలు : మండలంలోని కొండపర్తికి చెందిన బుర్ర రాంబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు రూ.35 వేలు, బీఆర్‌ఎస్ నాయకులు రూ.18 వేలు సాయం శనివారం అందజేశారు. రాంబాబు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాంబరాజు, శంకరయ్య, యాదగిరి, చంద్రమౌళి, ప్రభాకర్, అశోక్, రాజు తదితరులు ఉన్నారు.

### 'ఎన్నికల్లో సీపీఎం ఒంటరిగానే పోటీ'

ఐనవోలు : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెంకటాపురంలో నారాయణరెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన పార్టీ మండలస్థాయి విస్తృత సమావేశానికి ప్రభాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా వామపక్షాలు లౌకిక శక్తులతో కలిసి పోటీకి దిగుతున్నాయని విమర్శించారు. మతోన్మాద రాజకీయాలకు సీపీఎం వ్యతిరేకమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులు బొట్ల చక్రపాణి, కాడబోయిన లింగయ్య మాట్లాడారు. పేదలకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. రైతులకు యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. మండలంలో ప్రభుత్వ భూములు, చెరువులు ఆక్రమణకు గురయ్యాయని అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు నాగరాజు, ఉప్పలయ్య, రామ్‌కుమార్, మహేందర్, గుంశావలి, కవిత, గోపాల్, సుధాకర్, నర్సయ్య, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితా



గీసుకొండ : మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

నర్సంపేట/నర్సంపేట రూరల్/దుగ్గొండి/ఖానాపురం/పర్వతగిరి/సంగెం/గీసుకొండ: స్థానిక సంస్థల ఎన్నికల ఓటరు ముసాయిదా జాబితాలో అభ్యంతరాలు తెలిపితే సరి చేసి సెప్టెంబర్ 2న తుది జాబితా విడుదల చేస్తామని నర్సంపేట, దుగ్గొండి, ఖానాపురం, పర్వతగిరి, సంగెం మండలాల ఎంపీడీఓలు శ్రీనివాసరావు, అరుంధతి, సునీల్‌కుమార్, మాలోతు శంకర్, రవీందర్, పాక శ్రీనివాస్, చెన్నారావుపేట మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ ఆయేషా పర్వీన్ తెలిపారు. ఆయా మండలాల్లో రాజకీయ పార్టీల నాయకులతో శనివారం నిర్వహించిన సమావేశాల్లో ఎంపీడీఓలు మాట్లాడారు. రాజకీయ పార్టీల నాయకులు సూచనలు, సలహాలు అందించారు.

**చనిపోయిన వారి ఓటు తొలగించాలి**

జాబితాలో చనిపోయిన వారి పేర్లున్నాయని, వారి ఓటు తొలగించాలని బీజేపీ గీసుకొండ మండల అధ్యక్షుడు చొక్కం శ్రీనివాస్, నియోజకవర్గ ప్రతినిధి ముల్క ప్రసాద్ అధికారులను కోరారు. కాగా జాబితా నుంచి చనిపోయిన వారి పేర్లు తొలిగించే అవకాశం లేదని, సమస్యను ఎన్నికల కమిషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీఓ పాక శ్రీనివాస్ తెలిపారు. సమావేశాల్లో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీఓలు రామ్మోహన్‌రావు, శేషాంజన్‌స్వామి, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, రాజకీయ పార్టీల నాయకులు తోకల శ్రీనివాసరెడ్డి, చుక్క రమేష్, ఎర్రల్ల బాబు, కామిశెట్టి ప్రశాంత్, తొగరు వెంకటేశ్వర్లు, కూస రమేశ్, హరిబాబు, వెంకటనర్సయ్య, అశోక్, చీమల భిక్షపతి, ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, మాడుగుల రాజు, ఈర్ల నర్సింహరాములు, మోటూరి రవి, కత్తి కిరణ్, గజ్జి రాజు, కుమారస్వామి, అక్కపెల్లి రమేశ్, ఈర్ల పైడి, ధినేశ్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

## సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ



గీసుకొండ : పత్తి చేనును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



దుగ్గొండి : వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ మాధవి

- కేవీకే సీనియర్ సైంటిస్ట్ విజయ్‌భాస్కర్

గీసుకొండ : పత్తి, మొక్కజొన్న, వరి, సోయా, పసుపు పంటల్లో సస్యరక్షణ చర్యలతో తెగుళ్లను నివారించొచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ విజయ్‌భాస్కర్ తెలిపారు. 'ఏరువాక-రైతు సాగుబడి' కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోతరాజుపల్లి, మచ్చాపూర్, గీసుకొండ, గంగదేవిపల్లి గ్రామాల్లోని పంట చేలను శాస్త్రవేత్తల బృందం శనివారం సందర్శించి రైతులకు సూచనలు అందించింది. ఈ సందర్భంగా సీనియర్ సైంటిస్ట్ విజయ్‌భాస్కర్ మాట్లాడారు. పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ రాజ్‌కుమార్, విశ్వతేజ, శ్రీహరి, ప్రసాద్, ఏఓ హరిప్రసాద్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

**'వరి'లో కాలిబాటలతో అధిక దిగుబడులు**

దుగ్గొండి : వరి పొలాల్లో ప్రతి రెండు మీటర్లకు కాలిబాటలు తీయడం ద్వారా చీడపీడలను నివారించడంతోపాటు అధిక పిలకలు వచ్చి దిగుబడి పెరుగుతుందని మండల వ్యవసాయ అధికారి మాధవి తెలిపారు. మండలంలోని వెంకటాపురంలో రైతుల వరి పొలాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. కాలిబాటల ఆవశ్యకతను వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ వైజయంతి, ఆత్మ మాజీ జిల్లా డైరెక్టర్ తాళ్లపెల్లి వీరస్వామి, సొసైటీ డైరెక్టర్ జంగిలి రవి, నాయకులు గుజిలే రమేశ్, సుధాకర్, బాలరాజు, లింగారెడ్డి, సారంగం, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

**సేంద్రియ వ్యవసాయం మేలు**

ఖానాపురం : సేంద్రియ వ్యవసాయం మేలని మండల వ్యవసాయ అధికారి బోగ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని భద్రుతండాలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి సాధించొచ్చని తెలిపారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అధిక దిగుబడి పొందాలని సూచించారు. నానో ప్లస్ యూరియా వినియోగించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ అంకుష్, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ నాయకులు.. చిల్లర వేషాలు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

పర్వతగిరి : బీఆర్‌ఎస్ నాయకులు చిల్లర వేషాలు వేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా అందించకపోవడంతో మండలంలోని ఉట్టితండాకు చెందిన రైతు బాలునాయక్ పత్తి చేను పీకేసి ఆత్మహత్యకు సిద్ధపడ్డాడంటూ జరిగిన ప్రచారంపై శ్రీనివాస్ నాయక్ స్పందించి మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బాలునాయక్ ఈనెల 27న యూరియా తీసుకున్నాడని, ఆయన పదెకరాల భూస్వామి అని, అధిక వర్షాలతో 15 గుంటల పత్తి వేరే పంట వేసేందుకు తొలగించగా స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు యూరియా కొరత పేరుతో వీడియోలు తీసి దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సదరు రైతు బీఆర్‌ఎస్ కార్యకర్త అన్న విషయాన్ని మాజీ మంత్రి దయాకర్‌రావు స్వయంగా ప్రకటించారని తెలిపారు. యూరియా కొరత కొంత ఉన్న విషయం వాస్తవేనని, అందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కారణమని చెప్పారు. రైతులకు అవసరమైన మేరకు యూరియా అందించే దిశగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని తెలిపారు. కుటిల బుద్ధితో రాష్ట్ర ప్రభుత్వాన్ని పలుచన చేసేందుకు యత్నిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుల భరతం పట్టాలని మండల ప్రజలను కోరారు.

## విద్యతోనే జీవితంలో ఉన్నతి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సునీత

- మోడల్ స్కూల్, కాలేజీ ప్రిన్సిపాల్ సునీత

ఖానాపురం : విద్యతోనే జీవితంలో ఉన్నతి సాధించగలమని పీఎం శ్రీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. మండలంలోని బుధరావుపేటలో ఆ స్కూల్, కాలేజీలో శనివారం వెల్కమ్ టు ఫ్రెషర్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మిస్టర్, మిస్ స్కూల్, కాలేజీ ఫ్రెషర్లను ఎంపిక చేసి ప్రకటించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ప్రణాళికాయుతంగా చదువుకోవాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రుల, గురుకుల కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. సమాజంలో ఆదర్శప్రాయులుగా నిలవాలని కోరారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాసుల రవికుమార్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.